క్లుప్తంగా

అవగాహనతోనే డెంగీ నివారణ



అంగరలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

కపిలేశ్వరపురం: ఆరోగ్యంపై అవగాహనతో మెలగడం ద్వారా డెంగీ వ్యాధిని నివారించవచ్చని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. మండలంలోని అంగరలో గురువారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ వీధుల్లో నినాదాలు చేస్తూ, వ్యాధి లక్షణాలు, చికిత్స, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, హెచ్ఈ బి.రామారావు, వైద్య, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమకాటుతో వ్యాధులు



రాయవరం పీహెచ్‌సీ వద్ద డెంగీ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

రాయవరం: జాతీయ డెంగీ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీల వైద్యాధికారులు అనిరుధ్, ఎం.శ్రీనివాస్, మణికంఠ నేతృత్వంలో డెంగీపై అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు అనిరుధ్, శ్రీనివాస్, మణికంఠ మాట్లాడుతూ ఆడ ఎడిస్ ఈజిప్ట్ దోమ కాటు వల్ల డెంగీ వ్యాధి వస్తుందన్నారు. పగటి పూట కుట్టే దోమల వల్ల మాత్రమే డెంగీ బారిన పడతారన్నారు. దోమ కుట్టిన ఐదు రోజుల నుంచి ఎనిమిది రోజులకు వ్యాధి లక్షణాలు బయటపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ నివాస ప్రాంతాల పరిసరాల్లో అపరిశుభ్ర పరిస్థితులు లేకుండా చూసుకోవాలన్నారు. డెంగీపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రాయవరం, మాచవరం పీహెచ్‌సీల వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీకి పరామర్శ



కాకినాడ ఆసుపత్రిలో సంతోషంను పరామర్శిస్తున్న సూర్యప్రకాశ్

రామచంద్రపురం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంత సంతోషంను ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ పరామర్శించారు. ఎన్నికల్లో నియోజకవర్గంలో జనరల్ ఏజెంట్‌గా సంతోషం వ్యవహరించారు. ఈ సమయంలో ఆయన ప్రమాదానికి గురవడంతో చేతికి గాయమైంది. ఈ మేరకు ఆయన కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆసుపత్రికి వెళ్లి ఆయన్ని సూర్యప్రకాశ్ పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ నేతలు వెన్నేటి బాబు, బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌పై దాడికి ఖండన

రామచంద్రపురం రూరల్: కందులపాలెం గ్రామ ఉప సర్పంచ్ వెంటపల్లి రామకృష్ణపై ఈ నెల 14న జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏఐకేఎంస్ జిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్ధూ, ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డిలు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రామకృష్ణపై యదల వెంకటరమణ 14న తోటపేట **గ్రామంలోని రవి** భారత్ ఇంజినీరింగ్ వర్క్‌షాపు **వద్ద వెనుక నుంచి** దాడి చేసి హత్యాయత్నం **చేశాడన్నారు. కొన** ఊపిరితో ఉన్న రామకృష్ణను **అక్కడే పనిచేస్తున్న** వర్క్‌షాపు యజమాని, **సిబ్బంది ఆటోపై** రామచంద్రపురం ఏరియా **ఆసుపత్రికి తీసుకు** వెళ్లి చికిత్స చేయించారన్నారు. **రాజకీయ కక్షతో** హతమార్చాలని చూసిన వెం**కటరమణపై క్రిమి**నల్ కేసులు పెట్టి తక్షణం అరె**స్ట్ చేయాలని పోలీ**సులను డిమాండ్ చేశారు.

19 నుంచి పళ్లాలమ్మ జాతర

మామిడికుదురు: లూటుకుర్రు బోనం మెరకలో కొలువు దీరిన గ్రామ దేవత శ్రీపళ్లాలమ్మ జాతర మహోత్సవాలు ఈ నెల 19వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ గురువారం తెలిపింది. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం మహిళలచే సామూహిక 108 కలశ పూజ, సామూహిక లక్ష కుంకుమార్చనలు, వివిధ పుష్ప, ఫలార్చనలు, విశేష మహా నివేదనలు ఉంటాయన్నారు. గణపతి, మహా కాళీ, మహాలక్ష్మి, మహా సరస్వతి, ఆదిమూల శాంతి హోమాలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఉంటుందని చెప్పారు. రాత్రి అమ్మవారి జాతర మహోత్సవం జరుగుతుందన్నారు. దీనిని పురస్కరించుకుని పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కాటు వేస్తే.. తప్పని చేటు

- గోదావరి తీర గ్రామాల్లో విష సర్పాల సంచారం
- సకాలంలో చికిత్స అందించాలి
- పీహెచ్‌సీల్లో అందుబాటులో యాంటీ స్నేక్ వీనం



పి.రత్నకుమారి, వైద్యాధికారి

కపిలేశ్వరపురం: కొద్ది రోజులుగా అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. వ్యవసాయ క్షేత్రాల్లో కోతలు దాదాపు పూర్తయ్యాయి. దీంతో విష సర్పాలు పొలాల నుంచి జనావాసాల్లోకి చేరి హల్‌చల్ చేస్తున్నాయి. చిరుజల్లుల వాతావరణం సరీసృపాల సంచారానికి అనుకూలంగా ఉండటంతో వాటి బెడద తప్పడం లేదు. కనిపించిన పాములు రెప్పపాటులో అదృశ్యమవుతున్నాయని తీర గ్రామాల ప్రజలు అంటున్నారు. పాము కాటు వల్ల కలిగే ప్రమాదాలు, చికిత్స విధానం, ఆస్పత్రుల్లో చికిత్స తీరు తదితర అంశాలపై అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి వివరించారు.

గ్రామాల్లో పరిస్థితి ఇలా..

కపిలేశ్వరపురం మండలం అంగరలో దళితవాడ సమీపంలో ఇటీవల పాము నివాస ప్రాంతంలోకి చేరింది. అప్రమత్తమైన స్థానికులు సర్పాన్ని హతమార్చి, ప్రాణాలను కాపాడుకున్నారు. మండలంలో పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన ఘటనలున్నాయి. నల్లూరులో 2021 నవంబర్ 29న పాము కరవడంతో ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న ఆరేళ్ల బాలుడు బి.నాగేంద్ర మృతి చెందాడు. గతంలో కోరుమిల్లి గోదావరి గట్టుపై పచ్చగడ్డిని కోస్తుండగా, గ్రామానికి చెందిన వృద్ధుడు సుంకర నాగేశ్వరరావు పాముకాటుతో చనిపోయాడు. నల్లూరులోని చిన్నారిని విష సర్పం కరవడంతో అంగర పీహెచ్‌సీలో చికిత్స చేశారు. ఎటు వెళితే.. ఎక్కడ ఏ పాము నక్కి ఉందోనన్న ఆందోళనతో ప్రజలు హడలిపోతున్నారు. కె.గంగవరం మండలం శేరిలంక, కపిలేశ్వరపురం మండలం అద్దంకివారిలంక, కేదారిలంక, పల్లపులంక, నారాయణలంక, వీధివారిలంకలు పూర్తిగా గోదావరిలో ఉన్నాయి. స్థానికులు నిత్యం లంక పొలాల్లో పని చేస్తుంటారు. కోరుమిల్లి, వాకతిప్ప, కపిలేశ్వరపురం, తాతపూడి, శేరిలంక, కోటిపల్లి, కూళ్ల శివారు ప్రాంతాల్లో విష సర్పాల సంచారం అధికంగా ఉంది. వాకతిప్ప, అచ్యుతాపురం, అంగర, వానపల్లి, కొత్తపేట పీహెచ్‌సీల్లో యాంటీ స్నేక్ వీనం(ఏఎస్వీ) మందు అందుబాటులో ఉన్నట్టు ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు చెబుతున్నారు.



కపిలేశ్వరపురంలోని ఓ ఇంట్లో నక్కిన పాము (ఫైల్)

పాముకాటు లక్షణాలు

కరిచిన పామును బట్టి బాధితునిలో లక్షణాలు కనిపిస్తాయి. కాటు సమయంలో బాధితుడి శరీరంలోకి ఎక్కిన విషం పరిమాణాన్ని బట్టి ప్రమాద తీవ్రత ఉంటుంది. నల్లతాచు పామైతే విష ప్రభావం త్వరితంగాను, సాధారణ తాచుపాము ప్రభావం కాస్త ఆలస్యంగా ఉంటుంది. విష సర్పం కాటు వేసిన ప్రదేశంలో కోరల గాయాలు స్పష్టంగా కనిపిస్తాయి. నొప్పి క్రమక్రమంగా వ్యాపిస్తూ, తిమ్మిరిగా అనిపిస్తుంది. పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్టు, గొంతు కండరాలు బిగుసుకుపోతాయి. గొంతులో ఏదీ దిగని పరిస్థితి తలెత్తుతుంది. చొంగ కారవచ్చు. కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోయే అవకాశముంది.

ప్రాథమిక చికిత్స ఇలా..

పాము కాటు పైభాగంలో కట్టుకట్టాలి. ఆస్పత్రికి తీసుకెళ్లే లోపు ఆలస్యమవుతుంటే, మధ్యమధ్యలో కట్టును వదులు చేసి మళ్లీ కడుతుండాలి. కాటు వద్ద విషాన్ని పిండాలి. గుండె వేగం పెరగకుండా జాగ్రత్త పడాలి. కాటు వేసిన శరీర భాగాన్ని గుండెకంటే కిందికు ఉండేలా చూడాలి. కాటుకు గురైన వ్యక్తి నిద్రపోతే అపస్మారక స్థితికి చేరుకునే ప్రమాదం ఉంది. మెలకువగానే ఉంచి, త్వరితగతిన ఆస్పత్రికి తరలించాలి. విషానికి విరుగుడైన ఏఎస్వీ మందు ఉండే స్థాయి గల ఆస్పత్రికి తరలించాలి.

ఆస్పత్రిలో చికిత్స విధానం

కాటు వేసిన సర్పం విషపూరితమైనదా? కాదా? అన్న విషయాన్ని నిర్ధారించుకునేందుకు వైద్యుడు అడిగే ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. తీవ్రతను బట్టి విషం విరుగుడు మందు ఏఎస్వీను ఇంజక్షన్ రూపంలో ఇస్తారు. బాధితునికి శక్తి కలిగేందుకు సెలైన్ ఇస్తూ, ఇతర ఆరోగ్య సమస్యలు రాకుండా చికిత్స అందజేస్తారు. మరణం సంభవిస్తే మెడికో లీగల్ కేసు కింద అధికారికంగా నమోదు చేస్తారు.

టీడీపీది మేకపోతు గాంభీర్యం

రామచంద్రపురం: తాము గెలుస్తామంటూ టీడీపీ నేతలు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి సత్తి శంకర్‌రెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాల ద్వారా ప్రజల మనస్సును గెలిచారన్నారు. అందుకే ఆయనను తిరిగి సీఎంగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ వచ్చి ఓట్లు వేశారన్నారు. ఓటింగ్ శాతం పెరిగితే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు పడ్డాయంటూ టీడీపీ నేతలు వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వానికి మద్దతుగా అన్ని ఓట్లు పడ్డాయనే విషయాన్ని టీడీపీ తెలుసుకోవాలన్నారు. మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు కానుందని శంకర్‌రెడ్డి పేర్కొన్నారు.

వసతులు కల్పించండి

కాజులూరు: తణుకువాడ శివారు దొరగారిపాలెంలో వసతులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు. గురువారం పంచాయతీ పాలకవర్గ మాజీ సభ్యుడు డొప్పా బాలకృష్ణ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీల ఏర్పాటు, తాగునీటి సరఫరా, రహదారుల సదుపాయం కల్పించాలన్నారు. శలపాక, మంజేరు రహదారి నుంచి గ్రామంలోకి వచ్చేందుకు కోరంగి కెనాల్‌పై నిర్మించిన కాలిబాట వంతెనకు ఇరువైపులా అప్రోచ్ నిర్మించాలన్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు.

హాయిహాయిగా.. చల్లచల్లగా..



యానాం- ద్వారపూడి రహదారిలో ఉప్పుమిల్లి, కుయ్యేరు మధ్య నీడనిచ్చే చెట్లు

కాజులూరు: ఆ దారిలో ప్రయాణం హాయిహాయిగా సాగిపోతోంది.. మండు వేసవిలోనూ పచ్చని చెట్లు గొడుగులా రక్షణ ఇస్తున్నాయి. యానాం, ద్వారపూడి రహదారిలో కాజులూరు మండలం ఉప్పుమిల్లి నుంచి కుయ్యేరు వరకూ కిలోమీటరు పొడవున రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు హాయి గొలుపుతున్నాయి. వాహనచోదకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. భానుడు ఉగ్రరూపాన్ని చూపిస్తున్న వేళ కూడా ఈ దారిలో ప్రయాణం అలుపుసొలుపు లేకుండా సాగుతోంది.

నేడు ఉచిత వైద్య శిబిరం

కాజులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శలపాకలో జరుగనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. గురువారం గ్రామంలో విలేకరులతో ఆమె మాట్లాడుతూ సర్పంచ్ పోతుల గనిరాజు అధ్యక్షతన జరిగే ఈ శిబిరంలో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చెందిన వైద్య నిపుణులు పాల్గొని రోగులకు సేవలందిస్తారన్నారు. బీపీ, షుగర్, పలు దీర్ఘకాలిక వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మరింత మెరుగైన చికిత్స అవసరమని గుర్తించిన వారికి వైఎస్సార్ ఆరోగ్య పథకం ద్వారా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తారన్నారు. రోగులకు అవసరమైన మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు.

వెంకన్న కల్యాణం రేపు

అంబాజీపేట: అంబాజీపేట కొర్లపాటి వారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 20న స్వామి వారి తీర్థం, 17న అంకురార్పణ, ధ్వజారోహణ, 18న స్వామివారి కల్యాణం, 20న సదస్య వ్రతం, 23న చక్రస్నానం, 24న పుష్పోత్సవం నిర్వహించనున్నామన్నారు.

వేగం పుంజుకుంది



వాడ్రేవుపల్లి మీడియం డ్రెయిన్‌పై వంతెన నిర్మాణ పనులు

- వాడ్రేవుపల్లి డ్రెయిన్‌పై వంతెన నిర్మాణం
- రూ.1.01 కోట్లతో పనులు

మామిడికుదురు: అభివృద్ధి పనుల వేగం పుంజుకుంది.. ముంపునీటి సమస్యకు మోక్షం దిశగా అడుగుపడుతోంది.. 3 వేల ఎకరాల్లోని ముంపు నీరు గోదావరి నదిలోకి వెళ్లే వాడ్రేవుపల్లి మీడియం డ్రెయిన్‌పై ఆరు దశాబ్దాల కిందట నిర్మించిన కాజ్‌వే శిథిలస్థితికి చేరింది. దాని స్థానే పక్కా వంతెన నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. కేవలం నెల రోజుల వ్యవధిలోనే 70 శాతం పనులను పూర్తి చేశారు. వర్షాకాలానికి ముందుగానే పనులను పూర్తి చేయాలన్న కృత నిశ్చయంతో అధికారులు ఉన్నారు. పాశర్లపూడిలంక- లూటుకుర్రు గ్రామాల సరిహద్దులోని వాడ్రేవుపల్లి మీడియం డ్రెయిన్‌పై సుమారు 60 ఏళ్ల కిందట కాజ్‌వే నిర్మించారు. ఇది పూర్తిగా శిథిలమైంది. దీనిని తొలగించి అధునాతన తరహాలో వంతెన నిర్మిస్తున్నారు. వ్యవసాయ భూములకు ముంపు సమస్యను పూర్తిగా పరిష్కరించాలన్న లక్ష్యంతో కార్యాచరణ చేపట్టారు.

నిధులిచ్చి.. చొరవ చూపి..

కాజ్‌వే స్థానే వంతెన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, రైతుల డిమాండ్‌తో కలెక్టర్ హిమాన్షు శుక్లా డీఎంఎఫ్ ద్వారా రూ.41.60 లక్షలు మంజూరు చేశారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ ఎంపీ ఫండ్స్ నుంచి రూ.25 లక్షలు, జిల్లా పరిషత్ ద్వారా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు రూ.35 లక్షలు వెరసి వంతెన నిర్మాణానికి రూ.1.01 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో వంతెన నిర్మాణం చేపట్టారు. శిథిలస్థితికి చేరిన కాజ్‌వేను తొలగించి దాని స్థానే నూతన కట్టడం నిర్మిస్తున్నారు. కాజ్‌వేకు రెండు వైపులా క్రాస్ బండ్లు ఏర్పాటు చేశారు. ఒకవైపు నుంచి ద్విచక్ర వాహనాలు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

సమస్యకు శాశ్వత పరిష్కారం



ఎంతో కాలం నుంచి అధ్వానంగా ఉన్న కాజ్‌వేకు మోక్షం లభించడం ఆనందంగా ఉంది. కాజ్‌వే పాడైపోవడంతో ముంపు నీరు సక్రమంగా పారుదల కాక చాలా కాలంగా రైతులు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. వంతెన నిర్మాణంతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఆలస్యమైనా పక్కా వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టడం సంతోషకరం. వేలాది మంది రైతులకు ఈ వంతెన ఉపయోగపడుతుంది.

–బోణం శ్రీనివాసరావు, లూటుకుర్రు

ప్రజాప్రతినిధుల చొరవతో..



పాశర్లపూడిలంక- ఆదుర్రు రోడ్డు ఇటీవల ఆధునీకరణకు నోచుకుంది. దీనిని పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్డుగా అభివృద్ధి చేశారు. పూర్వం నిర్మించిన కాజ్‌వే మాత్రం అభివృద్ధి చెందలేదన్న బాధ ఇంతకాలం ఉండేది. కలెక్టర్, ప్రజా ప్రతినిధుల చొరవతో మోక్షం కలిగింది. ఇక్కడ వంతెన నిర్మించడం హర్షణీయం. దీనిని ప్రతి ఒక్కరూ స్వాగతిస్తున్నారు. సకాలంలో పనులు పూర్తి చేయడం అభినందనీయం.

–పనిమిశెట్టి చలపతిరావు, లూటుకుర్రు

యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం



యుద్ధ ప్రాతిపదికన బాక్స్ కల్వర్టు కమ్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌లో నిరంతరం నీటి ప్రవాహం ఉన్న ప్రాంతంలో క్రాస్ బండ్లు ఏర్పాటు చేసి డైవర్సన్ చానల్ ద్వారా నీటిని మళ్లించి నిర్మాణం చేపట్టాం. 40 టన్నుల భారీ క్రేన్, హాజక్స్ సహాయంతో ఒక్క రోజులోనే ర్యాఫ్ట్ మొత్తం పూర్తి చేశాం. ఈఈ కె.చంటిబాబు ఆధ్వర్యంలో జేఈ బి.చిన్నంరాజు పర్యవేక్షణలో పనులు నిర్వహిస్తున్నాం.

–అన్యం రాంబాబు, పీఆర్ డీఈఈ ప్రాజెక్టు

చల్లదనం.. కేరాఫ్ తాటి ముంజెలు

- హాట్ కేకుల్లా అమ్ముడు పోతున్న వైనం
- వేసవిలో పలువురికి ఉపాధి



ముంజెకాయలు విక్రయిస్తున్న వ్యాపారి



ముంజెకాయలు

రాయవరం: వేసవిలో శరీరానికి చల్లదనాన్ని చేకూర్చే తాటి ముంజెల అమ్మకాలు జోరందుకున్నాయి. తాటి ముంజెలు వేసవి తాపాన్ని తీర్చడమే కాకుండా చల్లదనం కలిగించడంతో ఈ సీజన్‌లో వీటికి గిరాకీ ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని చిరు వ్యాపారులు తాటి ముంజెలను తీసుకుని వచ్చి గ్రామాల్లో అమ్మకాలు సాగిస్తున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ అన్ని వయస్సుల వారు తాటి ముంజెలను ఇష్టపడుతుంటారు. వేసవిలో మాత్రమే లభించే తాటి ముంజెలు హాట్ కేకుల్లా అమ్ముడుపోతున్నాయని వ్యాపారులు అంటున్నారు.

మెండుగా ఉపాధి

పలువురు వేసవి సీజన్‌లో తాటి ముంజెలను అమ్ముకుంటూ ఉపాధి పొందుతున్నారు. మెట్టప్రాంతంలో తాటి చెట్లు అధికంగా ఉండడంతో, ఆ ప్రాంతం నుంచే అధికంగా తాటి ముంజెలు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వస్తుంటాయి. తాటి చెట్లను రైతుల వద్ద కొనుగోలు చేసే వ్యాపారులు సీజన్‌లో తాటి ముంజెల వ్యాపారం చేస్తుంటారు. తాటి ముంజెల సీజన్ కాగానే మిగిలిన కాయలను పండ్లుగా మారిన అనంతరం వాటిని పాతర వేసి, తేగలుగా మారిన తర్వాత వాటి అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం సీజన్ ప్రారంభం కావడంతో డజను ముంజెలు రూ.వంద వంతున అమ్మకాలు సాగిస్తున్నారు. కాయలను విడగొట్టి ముంజెలుగా తీయడంతో పాటు, ముంజెకాయలుగా కూడా విక్రయాలు సాగిస్తున్నారు. వివిధ అవసరాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారం కారణంగా తాటి చెట్లను విచ్చలవిడిగా నరికివేయడంతో ముంజెకాయల దిగుబడి ఏటేటా తగ్గిపోతున్నట్టు వ్యాపారి వెంకన్న తెలిపాడు. ఏటా వేసవి సీజన్‌లో ముంజెకాయల వ్యాపారం చేస్తుంటానని తెలిపాడు.

ఇష్టపడి చదవాలి

మామిడికుదురు: ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు అన్నారు. ఏపీఆర్‌జేసీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన మామిడికుదురుకు చెందిన లిఖితపూడి హరిసత్య రామమోహన్‌ను గురువారం ఆయన శాలువాతో సత్కరించారు. రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు.

ఐరన్ సిరప్ అందజేత

ఆలమూరు: మండలంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాలు, ఎంపీపీ పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం ఐరన్ సిరప్స్ అందజేశారు. చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యారోగ్య సిబ్బంది స్థానిక అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ఆరు నెలల నుంచి ఐదేళ్ల చిన్నారులకు డ్రాప్స్ అందజేశారు.

వేగానికి కళ్లెం వేయాలి

పి.గన్నవరం: రాజవరం-పొదలాడ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇక్కడ వాహనాల వేగానికి కళ్లెం వేయాలని బీఎస్పీ నాయకులు డిమాండ్ చేశారు. ఊడిమూడి గ్రామం వద్ద ఇటీవల ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నలుగురు జట్టు కార్మికుల కుటుంబాలను గురువారం వారు పరామర్శించారు.

ముందుక్కు సాగుదామా..!

- వేసవి దుక్కులతో క్రిమికీటకాలు, తెగుళ్ల నివారణ
- పంట దిగుబడులకు అవకాశం



పంట భూమిలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కు దున్నుతున్న రైతు

కొత్తపేట: సాగులో మెలకువలు పాటిస్తే.. సిరుల పంటే. సస్యరక్షణతో మంచి దిగుబడులే.. వేసవి కాలంలో పంట భూముల్లో దుక్కులు దున్నడం వల్ల అన్ని విధాలా మేలే. గతంలో అన్ని ప్రాంతాల్లోనూ వేసవిలో ముఖ్యంగా మండుటెండలు కాసే మే నెలలో దుక్కులు నాగళ్లతో దున్నేవారు. దీనివల్ల తెగుళ్ల సమస్య పెద్దగా ఉండేది కాదు. కాలక్రమేణా వేసవిలో కూడా పంట విరామం లేకుండా భూమిని ఖాళీగా పెట్టకుండా పంటలు పండించడంతో భూమి ఆరడం లేదు. ఈ నేపథ్యంలో క్రిమికీటకాలు నశించకుండా భూమిలోనే ఉండిపోయి మలి పంటపై దాడి చేస్తున్నాయి. అలా కాకుండా వేసవిలో కనీసం ఏప్రియల్ 15 నుంచి జూన్ 15 మధ్య పల్లం, మెరక అనే తేడా లేకుండా భూమిని ఖాళీగా పెట్టి వేసవి దుక్కులు దున్నటం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు. కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, ఆలమూరు మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు 28,956 ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. 19,640 ఎకరాల్లో ఉద్యాన పంటల విస్తీర్ణం ఉంది.

ఇలా చేయడం మంచిది

భూమి పైభాగం ఆరిపోయినా లోపల భాగం తేమతో ఉంటుంది. అదే ట్రాక్టర్ ప్లావ్ నాగళ్లతో దుక్కులు దున్నడంతో నేల సుమారు రెండు అడుగులు మేర తిరగబడి లోపలి భాగంపైకి వస్తుంది. ఆ విధంగా లోపల పంటకు హాని చేసే పురుగులు బయటపడి నశిస్తాయి. ముఖ్యంగా పంటలో కాండం తొలుచు పురుగు, ఆకుముడత పురుగు, కాండం కుళ్లు తెగుళ్లకు కారకాలైన పురుగులు గుడ్లు పొదిగి నేలలో ఉంచడం వల్ల వచ్చే పంటలో మళ్లీ ఆ తెగులు వ్యాప్తి చెంది పంటను నాశనం చేస్తాయి. వేసవి దుక్కులు దున్నడంతో ఆ తెగులు జాతికి చెందిన బీజాలు బయటపడి వేడికి చనిపోవడం లేదా పక్షులు తినడంతో తెగుళ్ల వ్యాప్తి తగ్గుతుంది. లోపలి పోషకాలు పైకి రావడంతో పంటలకు దోహదపడతాయి. అలాగే మొండి జాతికి చెందిన గడ్డి మొక్కలు, కలుపు మొక్కల మూలాలు ఎండకు ఎండిపోయి వాటి సమస్య తగ్గడంతో పాటు దమ్ములో కుళ్లి నేల సారవంతమవుతుంది.

తెగుళ్లు తగ్గి.. నేల సారవంతం



వేసవి దుక్కులు దున్నడం వల్ల తెగుళ్ల వ్యాప్తి నివారించవచ్చు. పంటలో ఉన్న తెగుళ్ల బీజాలు నిర్మూలించవచ్చు. ఫలితంగా ఖర్చు తగ్గుతుంది. అంతేకాకుండా నేల కూడా సారవంతమవుతుంది. తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చు. రైతులు అందరూ వేసవి దుక్కులు దున్నడం వల్ల మేలు చేకూరుతుంది. అధికారుల సూచనలు పాటిస్తూ వారు ముందుకు వెళ్లాలి.

–జి.పద్మలత, ఏఓ, కొత్తపేట

ఎత్తుపల్లాలు చదును

దుక్కులు దున్నడం, తద్వారా కలియపెట్టడం వల్ల భూమి ఎత్తు పల్లాలు సరిచేసుకోవడానికి అవకాశం ఉంటుంది. పల్లం, మెట్ట భూములకు నీరు పెట్టినప్పుడు, ఆ నీరు ద్వారా ఎరువులు సరఫరా చేసినప్పుడు పల్లంలోనే ఉండిపోకుండా చేనంతా సమాంతరంగా చేరేందుకు మొత్తం భూమంతా సమానంగా ఉండాలి. అందుకు వేసవి దుక్కులు దున్నినప్పుడు ఎత్తు పల్లాలు సరిచేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు.

ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేవీ సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ కోర్సులలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాలలో అందుబాటులో ఉన్నాయన్నారు. జూన్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు సత్యనారాయణ తెలిపారు.

వైద్యానికి ఆర్థిక సాయం

రావులపాలెం: అన్నవాహికలో లోపంతో పుట్టిన బాలుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం రూ. 23 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కాట్రేనికోన మండలం పెనుమల్ల గ్రామానికి చెందిన చిటికెన శివప్రసాద్, శిరీషల కుమారుడు (3 నెలలు) పుట్టగానే అన్నవాహిక, ఊపిరితిత్తుల నాళం రెండు కలిసిపోయి తాగిన పాలు ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోతున్నాయి. ఇప్పటి వరకూ వైద్యులు ఐదు సార్లు శస్త్రచికిత్సలు చేశారు. వాటికి సుమారు రూ.3 లక్షల వరకూ ఖర్చు అయ్యింది. ఇంకా వైద్యం చేయించాల్సి ఉండడంతో తల్లిదండ్రులు స్థానిక కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థను సహాయం కోరారు. రావులపాలెంలో బాబు మావయ్య విజయకుమార్‌కి సేవా సంస్థ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు.